7

సాక్షి నల్లగొండ

మంగళవారం ; 18 ; జూలై ; 2023



ప్రాచీన సంపదకు నిలయం ఫణిగిరి

ఫణిగిరి బౌద్ధక్షేత్రం ప్రాచీన సంపదకు నిలయమని పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని నాగిరెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం సోమవారం రాత్రి లక్ష పుష్పార్చన నిర్వహించారు. అమావాస్య కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. అమావాస్య రాత్రి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సతీష్‌శర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్ శర్మ వేద మంత్రాలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో దేవాదాయ శాఖ సిబ్బంది, పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

జగదీశ్వర్ సేవలు చిరస్మరణీయం



బుజ్జిబాబును సన్మానిస్తున్న మేడ్చల్ అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

రామగిరి(నల్లగొండ) : బాల సాహిత్యానికి పెండెం జగదీశ్వర్ సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో సోమవారం జరిగిన పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కార ప్రధానోత్సవ సభకు నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగదీశ్వర్ కీర్తిని చిరస్థాయిగా నిలిపేందుకు ఆయన పేరుతో పురస్కారం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి పుప్పాల కృష్ణమూర్తి మాట్లాడుతూ జగదీశ్వర్ సాహిత్యాన్ని ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాలకు సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. మేరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ బాలల కోసం తన జీవితమంతా పరితపించిన సాహితీవేత్త జగదీశ్వర్ అని కొనియాడారు. అనతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ దార్ల బుజ్జిబాబుకు పురస్కారాన్ని అందజేశారు. డాక్టర్ తండు కృష్ణకౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్, కవులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఏబూషి నరసింహ, మాదగాని శంకరయ్య, పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ ఉప్పల పద్మ, డాక్టర్ మండల స్వామి, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, డాక్టర్ చింతోజు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా.. కళాభారతి



కళాభారతి నమూనా చిత్రం

నల్లగొండ టూటౌన్ : జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్మించనున్న కళాభారతి నమూనా సిద్ధమైంది. నల్లగొండలో అతి పెద్ద కళాభారతి నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా రూ.90.61 కోట్లతో కళాభారతి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. రెండు రోజుల క్రితం మున్సిపల్ అధికారులు టెండర్‌లు పిలిచారు. కళాభారతి భవన నమూనాను రూపొందించారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా సరికొత్త మోడళ్లలో రెండు వేల సీట్ల కెపాసిటీతో కళాభారతి నిర్మాణం చేపట్టనున్నారు. బయట కూడా మరో రెండు వేల మందితో సభలు, సమావేశాలు నిర్వహించుకునేలా నమూనాను తయారు చేశారు. వీటితో పాటు ప్రధాన రహదారి వెంట దుకాణాలు నిర్మించి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. దీని ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరనుంది.

ప్రజలపై 'ఫార్మా' పడగ

- జిల్లాలో రసాయన పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రజాభిప్రాయం లేకుండానే కంపెనీలకు అనుమతులు
- ఇటీవల పనులు ప్రారంభించిన యాజమాన్యాలు
- ఫార్మా కంపెనీల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రజలు
- అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే దీక్షలు, ఆందోళనలు



ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తున్న నారాయణపురం మండలం పుట్టపాక గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా ప్రజలకు కాలుష్యపు ప్రమాదం పొంచి ఉంది. పచ్చని పొలాలపై రసాయనాల ప్రభావం తీవ్రం కాబోతోంది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల వ్యర్థ రసాయనాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతుండగా.. ఇప్పుడు కొత్తగా వస్తున్న పరిశ్రమలతో మరింత ప్రమాదం ముంచుకొస్తోంది. ఉమ్మడి జిల్లాలో రసాయన పరిశ్రమల ఏర్పాటుకు 20కి పైగా కంపెనీలు కరోనా సమయంలో అనుమతులు పొందాయి. ఇప్పుడు ఒక్కొక్కటి తమ కంపెనీల ఏర్పాటును ప్రారంభించాయి. స్థానికంగా గ్రామాల్లో ప్రజలు వ్యతిరేకిస్తున్నా లెక్కచేయడం లేదు. మిర్యాలగూడ మండలంలోని అలగడపలో ఏర్పాటు చేయాలనుకున్న ఆహార ఉత్పత్తుల సెజ్‌ను ప్రజల అందోళనతో దామరచర్లకు మార్చే ఏర్పాట్లలో ఉండగా.. గట్టుప్పల్- నారాయణ్‌పూర్ మండలాల మధ్య, మునుగోడు మండలం కిష్టాపురంలో ఏర్పాటు చేసే కంపెనీలను వ్యతిరేకిస్తూ ప్రజలు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే..

కోవిడ్–19 సమయంలో కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు విషయంలో నిబంధనలను సడలించింది. కరోనా వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. దాన్ని ఆసరాగా చేసుకొని కొన్ని కంపెనీల ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు పొందాయి. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే పనులను ప్రారంభించాయి.

2016లో అనుమతులు.. ఇప్పుడు పనులు

గట్టుప్పల్‌లో ఏర్పాటు చేసే కాంతి ఫార్మా 2016లోనే అనుమతులు పొందినా గతేడాది పనులను ప్రారంభించింది. దీనిపై అప్పట్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో మునుగోడు ఎన్నికల సమయంలో మంత్రి కేటీఆర్ కంపెనీని తరలిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు కంపెనీ పనులను నిలిపివేయాలని, ముచ్చర్లలోని ఫార్మా సిటీకి తరలించాలని ఆదేశాలు అందాయి. అయితే ఆ కంపెనీ యాజమాన్యం మాకు అనుమతులు ఉన్నాయని, పనులు ఎలా ఆపుతారంటూ కోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం మళ్లీ పనులను ప్రారంభించడంతో ప్రజలు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేస్తున్నారు.

కిష్టాపురంలో 75 రోజుల నుంచి రిలే దీక్షలు

మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో సర్వే నంబర్ 356, 357లో రెండు ఎకరాల భూమిలో సన్‌లైట్ యాక్టివ్ డ్రగ్ ఇంగ్రిడియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ నిర్మాణ పనులను కొనసాగిస్తోంది. గ్రామంలో కంపెనీ అనుమతి కోసం పంచాయతీ తీర్మానం ఇవ్వాలని కోరగా పాలకవర్గం వ్యతిరేకించింది. కంపెనీ మాత్రం అనుమతి లేకుండానే పనులు సాగిస్తోంది. దీనిపై ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. అయినా పనులు కొనసాగుతుండడంతో ఫార్మా కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో 75 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ప్రజలపై తీవ్ర ప్రభావం..

ఫార్మా కంపెనీలు ఏర్పాటైతే స్థానిక ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే చౌటుప్పల్ తదితర ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల వ్యర్థాలను బయటికి వదిలేస్తుండడం, కొన్ని కంపెనీలు బావులు తోడి వాటిల్లోనే పడేస్తుండటంతో భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు ఆనారోగ్యం బారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో తాగే నీటిని కూడా కొనుక్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అనుమతులు పొందిన పరిశ్రమలన్నీ ఏర్పాటైతే ఆ ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంటుందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

అనుమతులు రద్దు చేయాలి



ఫార్మా కంపెనీ అనుమతులను రద్దు చేయాలి. కంపెనీ యాజమాన్యం తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి అనుమతులు పొందింది. కంపెనీ వల్ల ఈ ప్రాంతం జల, వాయు కాలుష్యంతో రైతులు, చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోతారు.

– సామల భాస్కర్, సర్పంచ్, పుట్టపాక

రద్దయ్యే వరకు ఉద్యమం ఆగదు



ఫార్మా కంపెనీని ఆపే వరకు మా ఉద్యమం ఆగదు. కంపెనీ ఏర్పాటు చేస్తే గట్టుప్పల్ మండల పరిధిలో గ్రామాల్లో కాలుష్యంతో ఇబ్బందులు తప్పవు. అన్ని గ్రామాల ప్రజలతో కలిసి ఉద్యమం కొనసాగిస్తాం.

– కర్నాటి మల్లేశం, ఫార్మా కంపెనీ, అఖిలపక్ష కమిటీ కన్వీనర్

చేనేత రంగులపై ప్రభావం



ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తే, కంపెనీ నుంచి వచ్చే రసాయనాలు చేనేత రంగులపై ప్రభావం చూపుతాయి. నీళ్లు కలుషితం కావడం వల్ల రంగుల్లో మార్పు వస్తుంది. చేనేత రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలి.

– కొలను రవీందర్, చేనేత జాతీయ అవార్డు గ్రహీత. పుట్టపాక

భూమి వదిలేసుకోవాల్సి వస్తుంది



కంపెనీ పక్కనే వాగు ఉంది. కంపెనీ నుంచి వదిలే రసాయనాలతో అందులో కలుస్తాయి. భూగర్భ జలాలు కలుషితమై పంటలు పండవు. మేం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. పంటలు పండక పోతే భూమి వదిలేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.

– పిట్ట పెంటయ్య, రైతు పుట్టపాక

నేటి నుంచి మూసీ నీటి విడుదల

- ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నాలుగు విడతల్లో ఇచ్చేలా ప్రణాళిక
- 35 వేల ఎకరాల ఆయకట్టుకు అందనున్న నీరు



నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వానాకాలం పంటకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు నాలుగు విడతలుగా నీటిని విడుదల చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది వేసవిలో కురిసిన అకాల వర్షాలకు జూన్ మొదటి వారంలోనే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. అయితే కాల్వల ఆధునికీకరణ పనులు కొనసాగుతుండడంతో ముందస్తుగా పంటలు సాగు చేసేందుకు నీటి విడుదల సాధ్యం కాలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో అధికారులు మూసీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దాదాపు నెల రోజుల వరకు దిగువకు నీటి విడుదల కొనసాగింది. ప్రధాన కాల్వల లైనింగ్ పనులు ఇటీవల పూర్తి కావడంతో విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 18న ఉదయం 9గంటలకు మూసీ ఆయకట్టుకు మొదటి విడత నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరవుతున్నారని మూసీ అధికారులు తెలిపారు.

35 వేల ఎకరాల ఆయకట్టు..

మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం (4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 641.95 అడుగుల(3.68 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉంది. మూసీ ప్రాజెక్టు కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో దాదాపు 35 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. ఇప్పటికే సాగు పనుల్లో బిజీగా ఉన్న రైతులు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టులో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. బోరు, బావులు ఉన్న రైతులు ఇప్పటికే నార్లు సిద్ధం చేసుకున్నారు.

ఐదేళ్లుగా రెండు పంటలకు సాగునీరు..

మూసీ ప్రాజెక్టు పూర్తిగా వర్షాధారం పైనే ఆధారపడి నిండుతుంది. దీంతో ఈ ప్రాజెక్టును కేవలం ఒకే పంటకు(యాసంగి) వారబంధీ పద్ధతిలో ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని విడుదల చేసేలా 4.46 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం డిజైన్ చేసి నిర్మించారు. 1963లో మూసీ ప్రాజెక్టు నిర్మాణం జరిగిన నాటి నుంచి 2018 వరకు కేవలం ఒక్కసారి మాత్రమే రెండు పంటలకు సాగు నీరందించారు. కానీ గడిచిన ఐదేళ్లుగా వానాకాలం ప్రారంభంలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రిజర్వాయర్ నిండుతోంది. దీంతో ఆయకట్టులో రెండు పంటలకు నీటిని విడుదల చేస్తున్నారు.

ఆర్‌టీసీ 'పల్లె వెలుగు'లో లోకల్ పాస్

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణ ప్రజలకు ఆర్‌టీసీ పల్లె వెలుగు బస్సుల్లో లోకల్ పాస్ అమలు చేస్తున్నట్లు నల్లగొండ డీఎం రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ పట్టణంలోని 5 కిలోమీటర్ల పరిధిలో బస్సులో ప్రయాణించేందుకు నెలకు రూ.500 చెల్లించి నల్లగొండ ఆర్‌టీసీ బస్టాండ్‌లో పాస్ తీసుకోవాలని పేర్కొన్నారు. పాస్ పొందిన వారు నెల రోజులపాటు నల్లగొండ పట్టణంలో పల్లె వెలుగు బస్సులో ఎక్కడైనా బస్సు ఎక్కి మరో చోట దిగొచ్చని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేవలం నల్లగొండ పట్టణానికే పల్లె వెలుగు పాస్ అమలులో ఉన్నట్లు తెలిపారు.

19న కలెక్టరేట్ ఎదుట బీజేపీ రైతు దీక్ష

నల్లగొండ టూటౌన్ : రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష నిర్వహిస్తున్నట్లు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల సీతారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులు గూండా నవీన్‌కుమార్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు దీక్షకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. దీక్షకు రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని యాపలగూడెం గ్రామానికి చెందిన వృద్ధుడు అదృశ్యమైనట్లు సోమవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాపలగూడెం గ్రామానికి చెందిన సూదిరెడ్డి మల్లారెడ్డి (70) జూన్ 3వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదు. గతంలో ఆరుసార్లు ఇలా ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిన అతడు మళ్లీ 15 నుంచి 20 రోజుల తర్వాత తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈసారి 45 రోజులు దాటినప్పటికీ తిరిగి రాకపోవడంతో అతడి భార్య సూదిరెడ్డి సువర్ణ సోమవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 4 తులాల బంగారు పుస్తెలతాడు, 50తులాల వెండి ఆభరణాలు, రూ.45వేల నగదు అపహరణ

చౌటుప్పల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.లింగోటం గ్రామానికి చెందిన గంగాపురం సుజాతకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ముగ్గురికీ వివాహాలు అయ్యాయి. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. కాగా సుజాత ఈ నెల 14న బోనాల పండుగకు హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లింది. సోమవారం ఆమె తిరిగి స్వగ్రామానికి చేరుకొని ఇంటికి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు తన ఇంట్లో దొంగతనం చేసినట్లు గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు, 50తులాల విలువైన వెండి ఆభరణాలు, రూ.45వేల నగదు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ దేవేందర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

పేద కుటుంబానికి అనుకోని కష్టం

- లివర్ ఇన్‌ఫెక్షన్, కామెర్లతో ఆస్పత్రిపాలైన కుమారుడు
- వైద్యానికి డబ్బుల్లేక, తనయుడి పరిస్థితి చూసి తల్లడిల్లుతున్న తల్లి
- దాతల సాయం కోసం ఎదురుచూపులు



హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉదయ్‌కిరణ్



ఉదయ్‌కిరణ్

కన్నీటి గాథ

మునగాల(కోదాడ): భర్త గుండెపోటుతో మృతిచెందడంతో కూలిగా పనిచేస్తూ తన ఇద్దరు కుమారులను చదివిస్తున్న మహిళకు అనుకోని కష్టం వచ్చిపడింది. ఆ మహిళ పెద్ద కుమారుడు ఉన్నట్టుండి అనారోగ్యానికి గురికావడంతో అతనికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతోంది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం కావడంతో ఇప్పటికే కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2లక్షలు అప్పు చేసింది. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక.. కుమారుడి బాధను చూసి ఆ తల్లి తల్లడిల్లుతోంది. దయార్ద్ర హృదయులు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటోంది. వివరాలు.. మునగాల మండల కేంద్రానికి చెందిన లంజేపల్లి మధు, రమణ భార్యాభర్తలు. వీరికి ఉదయ్‌కిరణ్, వేణుగోపాల్ సంతానం. మధు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ 2019లో గుండెపోటుతో మృతిచెందాడు. పెద్ద కుమారుడు ఉదయ్‌కిరణ్ కోదాడ పట్టణంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. తల్లి రమణ రోజువారి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. కాగా ఈ నెల 11న ఉదయ్‌కిరణ్ వాంతులు, విరేచనాలతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి దగ్గరికి వెళ్లి చూపించుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో మరుసటి రోజు కుటుంబ సభ్యులు ఉదయ్‌కిరణ్‌ని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ తీసుకెళ్లారు. అయినప్పటికీ అతడి ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో హైదరాబాద్‌లోని చైతన్యపురిలో గల పల్స్ కేర్ ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులు అక్కడి వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఉదయ్‌కిరణ్ ఆరోగ్యం మెరుగుపడలేదు. దీంతో మెరుగైన వైద్యం కోసం ఆదివారం వనస్థలిపురంలోని ప్రసిద్ధి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.2లక్షలు అప్పు చేసి వైద్యం అందించామని, ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేదని ఉదయ్‌కిరణ్ తల్లి రమణ వాపోయింది. ప్రస్తుతం ఉదయ్‌కిరణ్‌కు యూరిన్, లివర్ ఇన్‌ఫెక్షన్, కామెర్లతో పాటు ప్లేట్‌లెట్స్ సమస్య తీవ్రంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారని, దాతలు ఎవరైనా ఆర్థికసాయం చేసి తన కుమారుడి ప్రాణాలు కాపాడాలని కోరుతోంది.

లంజేపల్లి వేణుగోపాల్ (ఉదయ్‌కిరణ్ సోదరుడు)
బ్యాంక్ అకౌంట్ నంబర్: 40435981490
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మునగాల
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0021656
ఫోన్ పే, గూగుల్ పే నంబర్: 6305459002

దాతలు ఆదుకోవాలి



నా పెద్ద కొడుకు వారం రోజుల క్రితం జబ్బున పడ్డాడు. గత వారం రోజులుగా అప్పుచేసి చికిత్స అందిస్తున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. నా కుమారుడు ప్రాణాలు కాపాడుకునేందుకు నేను నానా ఇబ్బందులు పడుతున్నాను. ఇప్పటికే రూ.రెండు లక్షల అప్పు చేశాను. ప్రస్తుతం నా వద్ద రూపాయి కూడా లేదు. ఎవరైనా దాతలు ఆర్థికసాయం చేసి నా కుమారుడి ప్రాణాలు కాపాడండి.

– రమణ, ఉదయ్‌కిరణ్ తల్లి

కృష్ణానదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపం
- నాగార్జునసాగర్‌లోని కొత్త వంతెన వద్ద ఘటన



నాగార్జున్‌రెడ్డి మృతదేహం

నాగార్జునసాగర్: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కృష్ణానదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. విజయపురిటౌన్ ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన లోకసాని నాగార్జున్‌రెడ్డి (50) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారి ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో తరచూ కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపానికి గురైన నాగార్జున్‌రెడ్డి సోమవారం ఉదయం 8గంటలకు పైలాన్‌కాలనీలోని కొత్త వంతెన వద్దకు వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్ అక్కడ పెట్టి వంతెన మీద నుంచి కృష్ణానదిలోకి దూకాడు. అక్కడే పండ్లరసాలు విక్రయించే స్థానిక వ్యాపారులు చూసి వెంటనే అతడి భార్యాపిల్లలకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు విషయం తెలియజేయడంతో మత్స్యకారులు, గజ ఈతగాళ్లను పిలిపించి కృష్ణానదిలో గాలించగా నాగార్జున్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి స్థానిక కమలానెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కూనూరు కెనరా బ్యాంకులో చోరీకి యత్నం



బ్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, పోలీసులు

భువనగిరి: మండలంలోని కూనూరు గ్రామంలో గల కెనరా బ్యాంకులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. పోలీసులు, బ్యాంకు మేనేజర్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా శనివారం సాయంత్రం సిబ్బంది విధులు ముగించుకొని బ్యాంకు మూసివేసి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం 9.40 గంటలకు సిబ్బంది బ్యాంక్ తెరిచేందుకు లోపలికి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంకు వెనుక వైపు నుంచి లోపలికి ప్రవేశించి కిటికీ గ్రిల్స్ కట్ చేసినట్లు కనిపించింది. స్ట్రాంగ్ రూంకు వేసిన తాళం పగులగొట్టి ఉండగా లాకర్ ఓపెన్ కాలేదు. బ్యాంకులోని సీసీ కెమెరాల వైర్‌ను కట్ చేసి వీడీఆర్ బ్యాక్స్‌తో పాటు నెట్‌వర్క్ మోడెంను ఎత్తుకెళ్లారు. దీంతో బ్యాంక్ మేనేజర్ పి. కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర బ్యాంకు వద్దకు చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ–2 శివనాగప్రసాద్ ఉన్నారు.

న్యాయం జరగడం లేదని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న వెంకట్రావు

కోదాడ రూరల్: వాటర్ ట్యాంక్ కూల్చివేత సమయంలో తన ఇల్లు దెబ్బతినగా.. తనకు న్యాయం చేస్తానని చెప్పి పట్టించుకోవడంలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని చిమిర్యాలలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిమిర్యాల గ్రామంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను కూల్చేందుకు గ్రామపంచాయతీ, అధికారుల తీర్మానం చేశారు. కూల్చివేత పనులను వరంగల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. దీంతో ఈ నెల 10న ట్యాంక్‌ను నేలమట్టం చేస్తుండగా అది పక్కనే ఉన్న వెంకట్రావు ఇంటి ప్రహరీపై పడింది. అతడి ఇల్లు కూడా దెబ్బతింది. దీంతో వెంకట్రావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మరుసటి రోజు గ్రామపెద్దల వద్ద మాట్లాడుకుంటామని ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారు. కాగా తాను మూడెకరాల పొలం అమ్ముకొని ఇల్లు నిర్మించుకున్నానని, పెద్ద మనుషుల మధ్య మాట్లాడుకున్నట్లుగా తనకు న్యాయం జరగడం లేదని మనస్తాపానికి గురైన వెంకట్రావు సోమవారం తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అధికారులు తమకు న్యాయం చేయాలని బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు కోరుతున్నారు.

దారి దోపిడీ ముఠా సభ్యుల అరెస్ట్

- ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పాలకవీడు: అర్ధరాత్రి వాహనాలను ఆపి దారి దోపిడీకి పాల్పడుతున్న ముఠాను పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ రైల్వే ఫ్లైఓవర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్‌ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి పోలీసులు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో జాన్‌పహాడ్ రైల్వే ఫ్లైఓవర్ వద్ద ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వీరు కొంతకాలంగా అర్ధరాత్రి రైల్వే ఫ్లైఓవర్‌పై వాహనాలను అడ్డుకుని బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. పట్టుబడిన వారిలో పాలకవీడు మండలం కల్మెట్‌తండాకు చెందిన ధరావత్ నాగరాజు, రమావత్ సైదా, బాణావత్ శివాజీ, బెట్టెతండాకు చెందిన మాలోతు శేఖర్, దామరచర్ల మండలం ఓడపల్లికి చెందిన మహ్మద్ అఫ్రోజ్‌లు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి రూ.1500 నగదు, 5 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి వీరి వెనుక ఎవరెవరు ఉన్నారు, ఎక్కడెక్కడ ఎంతమంది వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ దారి దోపిడీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నం

- నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మర్రిగూడ: బాలికను కారులోకి ఎక్కించుకొని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన వ్యక్తిపై పోలీసులు సోమవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ కె. రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను ఆదివారం చర్లగూడెం గ్రామానికి చెందిన మాదగోని మహేష్ బలవంతంగా కారులో ఎక్కించుకొని ఆ గ్రామం నుంచి కిలోమీటరుకు పైగా దూరం వెళ్లాడు. ఇది గమనించిన బాలిక తండ్రి బైక్‌పై వెంబడించి కారును అడ్డగించగా, నిందితుడు బాలికను కారులో నుంచి దింపేసి పరారయ్యాడు. సోమవారం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితుడు మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. నలుగురిపై కేసు నమోదు

నాగారం: మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన కొమిరె అల్లయ్యపై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి. ముత్తయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న ఫణిగిరి గ్రామానికి చెందిన బోయినపల్లి నవీన్ ట్రాక్టర్‌పై వెళ్తూ అదే గ్రామానికి చెందిన కొమిరె అల్లయ్య ఇంటి ముందు ఉన్న నల్లా పైపును ట్రాక్టర్‌తో తొక్కించడంతో అది విరిగిపోయింది. దీంతో అదే రోజు సాయంత్రం అల్లయ్య, అతడి కుటుంబ సభ్యులు కలిసి బోయినపల్లి నవీన్ వద్దకు నల్లా పైపు విరగ్గొట్టిన విషయం అడడగా.. నవీన్‌తో పాటు అతడి అన్న బోయినపల్లి నాగరాజు, అదే గ్రామానికి చెందిన వేల్పు ల వెంకన్న, యామండ్ల అక్షయ్ కలిసి కొమిరె అల్ల య్యపై దాడి చేసి కొట్టారు. ఈ ఘటనలో అల్ల య్య మెడ, వెన్నుపూసకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అల్లయ్య తమ్ముడు సోమనర్సయ్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జేబు దొంగ రిమాండ్

మిర్యాలగూడ టౌన్: నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజల జేబులు కొట్టి డబ్బులు కాజేస్తున్న దొంగను మిర్యాలగూడ రూరల్ పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ముత్తినేని సత్యనారాయణ విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా నందిగామ గ్రామానికి చెందిన దాసరి బాజి ఈ నెల 15న మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి వచ్చి అక్కడే పలువురి జేబులు కొట్టి డబ్బులు కాజేస్తుండగా పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారు. నిందితుడిని సోమవారం మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి రూ.8వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ ఎస్‌ఐ దోరెపల్లి నర్సింహులు పాల్గొన్నారు.

ప్రేమను నిరాకరించిందని యువకుడి బలవన్మరణం



హర్షిత్ (ఫైల్)

మునుగోడు: అమ్మాయి తన ప్రేమని నిరాకరించిందని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ ఘటన మునుగోడు మండలంలోని రావిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రావిగూడెం గ్రామానికి చెందిన బొల్లు హర్షిత్(21) ఓ అమ్మాయిని ప్రేమించాడు. అయితే సదరు అమ్మాయి తన ప్రేమను నిరాకరించడంతో మనస్తాపానికి గురైన హర్షిత్ శనివారం మునుగోడు గ్రామ శివారులోని నార్కట్‌పల్లి రోడ్డు వంతెన వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అకస్మారస్థితిలోకి వెళ్లిన హర్షిత్‌ను స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. చిక్సిత నిమిత్తం హర్షిత్‌ను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటుల ఎస్‌ఐ తెలిపారు.

చెర్కుపల్లి గ్రామంలో విషాదఛాయలు

- వేర్వేరు ఘటనల్లో గ్రామానికి చెందిన ఇద్దరు మృతి




జనార్దన్ (ఫైల్)



సుధాకర్ మృతదేహం

కేతేపల్లి: మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆదివారం మృతిచెందారు. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్కుపల్లి గ్రామానికి చెందిన గంట సుధాకర్(34) ఆటో నడపటంతో పాటు వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుధాకర్ ఆదివారం గ్రామంలోని ఓ రైతు పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. వరి నారును మడులకు చేరవేస్తుండగా సుధాకర్ ఒక్కసారిగా కిందపడిపోయాడు. అక్కడే ఉన్నవారు గమనించి సుధాకర్‌ను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సోమవారం మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఇక ఇదే గ్రామానికి చెందిన వల్లపు జనార్దన్(38) ఆదివారం వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాడు. జనార్దన్ వరి నాట్లు వేసే బురద మడిలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి బురద పొలంలో కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వెంటనే జనార్దన్‌ను పొలం గట్టు మీదకు తీసుకొచ్చారు. అతడి గొంతు, ముక్కులోకి బురద వెళ్లడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఒకే రోజు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందటంతో చెరుకుపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి.


సూర్యక్షేత్రంలో అసిస్టెంట్ కమిషనర్ పూజలు



పూజలు చేస్తున్న ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సందీప్‌రెడ్డి

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో గల అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని సోమవారం సైబరాబాద్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మందడి సందీప్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర విశిష్టతను సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, క్షేత్ర అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కరాటే ఫెడరేషన్ జిల్లా చైర్మన్‌గా శివరాజు



శాలిగౌరారం: మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన వరికుప్పల శివరాజు జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ నల్లగొండ జిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలోని ఇందిరానగర్‌లో ఇటీవల నిర్వహించిన జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ సమావేశంలో తెలంగాణ వ్యవస్థాపక చైర్మన్ ఎంఎస్ పాషా తనను జిల్లా చైర్మన్‌గా నియమించారని తెలిపారు. శివరాజు గత సంవత్సరం ఏషియన్ అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



త్రిపురారం: రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం: రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలని త్రిపురారం మండలంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. 95వ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వ్యవస్థాపక వేడుకల్లో భాగంగా కంపాసాగర్ కేవీకేలో సోమవారం రెండో రోజు జిల్లాలోని రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతికతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల ప్రాముఖ్యత, నేల ఆరోగ్య పరిరక్షణ, వ్యవసాయంలో యాంత్రీకరణ, వాతావరణ ఆధారిత పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వర్మీ కంపోస్ట్ తయారీ, న్యూట్రా గార్డెన్‌లో మొక్కల పెంపకం గురించి రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. రైతులు పంటల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన వ్యవసాయంలో సాంకేతికత ప్రదర్శను రైతులు తిలకించారు. కార్యక్రమంలో కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, పల్లవి, రాములమ్మ, వాతావరణ శాస్త్రవేత్త సాయికిరణ్, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు పెంచాలి..

గరిడేపల్లి: ప్రకృతి వ్యవసాయం చేపట్టి రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గత కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. 95వ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వ్యవస్థాపక వేడుకలను గడ్డిపల్లి కేవీకేలో సోమవారం రెండో రోజూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక మోతాదులో వాడుతుండటం వలన ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గుతుందన్నారు. రైతులు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఖర్చు తగ్గడంతో పాటు నేల సారవంతమవుతుందన్నారు. సేంద్రియ ఎరువులతో పడించే పంటలు మార్కెట్‌లో అధిక ధర పలుకుతాయని పేర్కొన్నారు. కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను రైతులకు వివరించారు. అనంతరం కేవీకే మృతిక శాస్త్రవేత్త కిరణ్ సహజ వ్యవసాయంలో పాటించవలసిన పద్ధతులు, సేంద్రియ జీవన ఎరువుల వాడకం, లాభాల గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డి. ఆదర్శ్ వివిధ రకాల కషాయాల తయారీ విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి. నరేష్, సీహెచ్. నరేష్, డాక్టర్ టి. మాధురి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త.. భక్తుల ఇబ్బందులు



యాదగిరిగుట్ట పట్టణంలో శిల్ప కళాశాల, ఆండాళ్ సదనం వెనుక పేరుకుపోయిన చెత్త

యాదగిరిగుట్ట: పట్టణంలోని ఆండాల్ సదనం వెనుక చెత్తాదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. యాదాద్రీశుడిని దర్శించుకున్న భక్తులు పట్టణంలోని బస్టాండ్ ముందు ఉన్న ఆండాళ్ సదనంలో ఎక్కువగా బస చేస్తారు. అంతే కాకుండా శ్రీలక్ష్మీనరసింహ సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప కళాశాల సైతం అక్కడే ఉంటుంది. ఈ రెండింటి మధ్యలో మురుగు కాల్వ సరిగ్గా లేకపోవడంతో చెత్తాచెదారం చేరి అందులో పందులు స్వైర విహారం చేస్తూ అటు భక్తులు, ఇటు శిల్ప కలశాల విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చెత్తను శుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు.

సైనికుడి స్థలాన్ని కబ్జా చేసిన పోలీసు అధికారి

- ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయిన బాధితులు
- న్యాయం చేయాలని వేడుకోలు
- సదరు అధికారిపై కేసు నమోదు



తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను చూపుతున్న రవికిరణ్, జమున దంపతులు

మిర్యాలగూడ: ఇండియన్ ఆర్మీలో పనిచేసే సైనికుడి స్థలాన్ని కబ్జా చేశాడు ఓ పోలీసు అధికారి. సదరు పోలీసు అధికారికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వత్తాసు పలుకుతున్నారని బాధితులు వాపోయారు. సోమవారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మేక రవికిరణ్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేస్తున్నాడు. మిర్యాలగూడ పట్టణం సంతోష్‌నగర్‌లోని సర్వే నంబర్ 874లో గల 160గజాల ఖాళీ స్థలం తన నాయనమ్మ మేక సీతమ్మ నుంచి రవికిరణ్‌కు వారసత్వంగా సంక్రమించింది. దీంతో జూలై 4న రవికిరణ్ తన భార్య జమునకు ఆ స్థలాన్ని గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ స్థలం పక్కనే నివాసముంటున్న నందిపాటి ప్రభాకర్ మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా తమ ఖాళీ స్థలం అమ్మాలని నందిపాటి ప్రభాకర్ పలుమార్లు తమను ఫోన్‌లో సంప్రదించాడని, లేకపోతే ఆ స్థలంలో అక్రమ కట్టడాలు చేపడతామని బెదిరించాడని, స్థలం అమ్మకపోవడంతో అందులో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని రవికిరణ్, జమున దంపతులు వాపోయారు. తమ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని, అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపగా ఆ సమయంలో ఏఎస్‌ఐ ఎలాంటి ధ్రువపత్రాలు చూపించలేదని అన్నారు. అయినప్పటికీ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇదే విషయమై స్థానిక ప్రజాప్రతినిధులను కలిసినప్పటికీ ఫలితం లేదన్నారు. ఏఎస్‌ఐ గతంలో తమను బెదిరించిన కాల్ రికార్డ్స్ ఉన్నాయని బాధితులు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ, కలెక్టర్, డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏఎస్‌ఐకి మద్దతు తెలపడం వల్లే తమకు న్యాయం జరగడం లేదన్నారు. సోమవారం బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ప్రభాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ టూటౌన్ ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.